మహాగాయని

అద్భుతమైన స్వాంతన ఏదో కలిగేది ఆమె పాట వింటే, అది "ఇది" అని చెప్పలేని తీయని అనుభవం. గొప్ప కళాకారిణి అయిన ఆమె కమర్షియల్‌గా కూడా విజయం సాధించడం చాలా ఆశ్చర్యకరమైన విషయం.

దేవాలయాల్లో, నవాబుల ముఖమల్ మందిరాల్లో, రెడ్ కార్పెట్స్ పరిచిన ఫైవ్‌స్టార్ హోటల్స్‌లో - ఎక్కడైనా ఆవిడ సక్సెస్... వాతావరణంలోని మార్పు, బరువు, ఆమె వైబ్రేషన్స్‌ను ఏనాడూ సంచలనపరిచి ఎరగదసలు.

ఇది చాలామందికి ఆశ్చర్యం.

కూవం నది పక్కన, తాజ్‌మహల్ దగ్గరా, అందమైన సైద్రస్ చెట్లలోనించి విస్తరించే వెన్నెల నీడల మధ్య ఒకే అనుభూతి ప్రదర్శించగలగడం, ప్రతి "నోట్"లోనూ, అనూ అనుకున్న భావం పలకగలగడంలోనూ ఏ "మార్పూ" చూపించేది కాదు ఆమె.

మూడ్స్, వాతావరణంలోని డిప్రెషన్, నచ్చని మనుష్యుల మధ్య పాడలేకపోవడం, రాంగ్ వైబ్రేషన్స్ - ఇవన్నీ ఏవీ ఆమెను అంటకపోవడం చూసి ప్రపంచం, సాటి కళాకారులు కూడా ఆశ్చర్యపోయేవారు.

నేను జర్నలిస్ట్‌ను... వెంటనే "సరేలే" అనకండి ఆ మాట విని "నువ్వు సెన్సిటివ్‌వా, క్రిటిక్‌వా, సమీక్షకుడివా, ప్రేక్షకుడివా? ఇవన్నీ క్రోడీకరించి మథించి, విషయాన్ని చిలికి వెన్నపూసలా తేల్చి చెప్పి జాతిని జాగృతి చెయ్యగలిగితే ఆ మాట అనుకో" అనకండి.

ఒకనాడు మాకు జర్నలిస్ట్ మీటింగ్ అయింది.

కొంచెం నెరిసిన తలకాయలు, కళ్ళజోళ్ళు, చేతికర్రలు ఏమిటేమిటో మాట్లాడాయి.

ఆ మాటల్లో కోటంరాజు పున్నయ్య, పోతరాజు రామారావు, జి. వి. కృపానిధి, రామానంద ఛటర్జీ.... వీళ్ళందరూ, మరికొందరూ మాటల్లో కాసేపు జీవించారు.

కానీ, మాకు... కుర్రకారుకు వారెవరో తెలియాలని పెద్ద రూలేం లేదు.

జె. టి. సన్డర్‌లాండ్ అనే అమెరికన్ గురించి వచ్చినప్పుడు మాత్రం కొంచెం కుతూహలంగా విన్నాం.

"ఆయన ఎవరు?" పక్కనున్న ముసలాయనను చాలా మామూలుగా అడిగాను.

మహానుభావుడు. "Gathered the Indian resources for Indian Nationalism in., U.S.A." అన్నారు ఆయన. ఆ ధ్వనిలో అకుంఠితమైన గౌరవం. ఆ ఒక్క క్షణం ఆ భావాన్ని మనిషిగా నేనూ గౌరవించాను.

ముందు డ్రింక్స్, తరవాత డిన్నర్లు, ఆ తరవాత గిఫ్ట్స్‌కు అలవాటు పడిపోయిన మాకు న్యాపతి నారాయణమూర్తులు, ఖాసా సుబ్బారావులు గుర్తుకు రానక్కర్లేదు.

"అయినా మనం ఆనాటి వృద్ధాప్యపు గోడ మీద నిలబడి కూలిపోనక్కర్లేదు. మనది మోడ్రన్ జర్నలిజం...." అని మాలో సహం ఎదిగిన వ్యక్తులు వాదిస్తారేమో కానీ, అందరం ఆ మాట అనలేం.

మేమిప్పుడు మనుష్యుల్ని, పరిస్థితుల్ని చదివి వ్యాఖ్యానిస్తే చాలు. సమీక్షించక్కర్లేదు. విమర్శలు అసలు పనికిరావు. ఎవరి మైనస్ పాయింట్లన్నా చెప్పి, వాళ్ళను బాగుచెయ్యాలన్న తపన మాకొద్దు. అంత పాజిటివ్ ఆటిట్యూడు. "ఎదగాలి" అన్న తపన ఏ రాజకీయ వేత్తకూ, కళాకారుడికీ – అందులో ముఖ్యంగా సినిమాలో ప్రముఖులకు అసలు లేదు గాక లేదు. అంతరంగం వెలిగించే ఏ మూగ గొంతో అక్షరంగా పలకాలని ప్రయత్నించినా, దండలూ, పొగడ్తలూ వెంటనే ఆ అక్షరాలను తిరగేస్తాయి. జర్నలిజం అదృష్టవంతుడికి పబ్లిసిటీ స్టంటుగా మారిపోయింది. ఇవన్నీ ఇప్పుడు బయటకు చెప్పలేకపోయినా, మా 'మోటో' ఇదే! కాలం ఇప్పుడు నిజాయితీ పరుడుదీ, మేధావిదీ కాదు. మనసులో మాట బైటకు చెప్తే మమ్మల్ని శిక్షించగల బ్యూరోక్రసీది. ఇక్కడ లౌక్యుడికే కాలం.

అందుకని మౌనంగా ఆత్మవంచన చాటున ఏవో కొన్ని వార్తలు సేకరించి పంపేసి, ఒక గొప్ప చిత్రం చూసో, ఒక చక్కటి సంగీత కచేరీ వినో, అప్పుడప్పుడు స్పందించి రాసే మామూలు జర్నలిస్టును నేను.

కానీ వృత్తిని గౌరవించే కొందరి హృదయాల్లోనైనా, నిద్రాణమైన భావుకత వుంది. వుండి తీరుతుంది.

అలా నా వ్యక్తిగతమైన స్పందనతో, ఆ మహాగాయకురాలితో పరిచయం చేసుకున్నాను.

ఆవిడ చాలా విచిత్రమైన వ్యక్తి!

ఏ మాత్రం ఆర్టిస్టిక్‌గా వుండని ఆవిడ గది, రూపాయిలు అణాలతో సహా లెక్క పెట్టుకునే సహధర్మచారుడు, దండలు కూడా వీలైతే మళ్ళీ అమ్ముదామనుకునే సెక్రటరీ... వీళ్ళందరి మధ్యా బ్రతుకుతూ –

. లతామంగేష్కర్‌లాగా లక్షల రూపాయిల దేముడి మందిరం కట్టి పూజలు చెయ్యదేమో కానీ –

"ఏదో అతీతశక్తి నాకు ప్రేరణ...." అంటుంది.

అది ఒక లెవల్ మనుష్యులకు ట్రాష్‌గానే కనిపిస్తుంది కాబట్టి ఆవిడను నమ్మే ప్రసక్తిలేదు.

అందుకే నేను వదిలిపెట్టలేదు.

ఆవిడతో స్నేహం చేశాను. కానీ నా స్నేహంలో ఏ దురాశా లేదని ఆవిడకు తెలిసేటట్లు, నాతో స్నేహం చెయ్యడంలో ఏదో న్యూనత ఆవిడకు అంటకట్టకుండా వుండేటట్లు నా ప్రవర్తనద్వారా జాగ్రత్తపడ్డాను.

మా పరిచయం ఎదిగింది.

అందుకే, ఆవిడ నమ్మి తన "రహస్యం" చెప్పిందేమో!

"ఇంత గందరగోళాల మధ్య, చీకాకుల మధ్య ఎలా పాడగలుగుతున్నారు?" అంటే, అప్పుడు ఏదో సమాధానం చెప్పేసింది కానీ -

ఆ తరవాత, కొంత పరిచయం తరవాత నన్ను గురించి మనిషిగా నమ్మకం కుదిరిన తరవాత -

"నేను ఇక్కడ పాడుతున్నానని ఎవరు చెప్పారు? నా వరకు నేను అతని దగ్గర కూర్చునే పాడుతున్నాను" అంటే -

కొంచెం ఉలిక్కిపడ్డాను.

కారణం. అవతలి వ్యక్తి నాకు బాగా తెలుసు. అతి సామాన్యుడైన మామూలు అసిస్టెంట్ డైరెక్టరు. భార్యా పిల్లలూ, రోగిష్టి తల్లి, వెస్ట్ మాంబళంలో చిన్ని పెంకుటింట్లో నివాసం, సవ్యసాచిలా నీళ్ళ కరువు రోజుల్లో రెండు చేతులతో బక్కెట్లు మోస్తూ కనబడ్డ వ్యక్తి మామూలుగా చూస్తే అతనిలో ఏ ప్రత్యేకతా కనబడదు మరి.

మాటల్లో నాకు అర్థమైంది. వాళ్ళకు పెద్ద పరిచయం ఏం లేదు. దాన్ని గురించి ఆవిడకు గుర్తున్నట్లు కూడా అవతలి వ్యక్తికి గుర్తుండే అవకాశం లేదు. మరి దీనికి అర్థం?

ఇదంతా ఏదో సైకలాజికల్ నాన్సెన్స్.... ఏదో ఒక ఇన్స్పిరేషన్ కోసం అతణ్ణి వాడుకుంటుందేమో, నటిస్తోందేమోనని తృప్తిపడ్డాను నేను.

ఇది మా సినిమా జనానికి, ముఖ్యంగా కవులకు చాలా ఎక్కువ.

కథ వండి వార్చడానికి, ఆఖరికీ ఇన్స్పిరేషన్‌ను కూడా కావాలంటే ఖరీదు కట్టి కొనివ్వగలం అని మభ్యపెడతారు వారిని ప్రొడ్యూసర్స్.

కానీ పరిచయం పెరిగినకొద్దీ, ఆవిడ ధోరణిలో ఏదో ప్రత్యేకత గమనించిన కొద్దీ, ఆమె మాటల్లో ఏమాత్రమన్నా నిజముందేమోనన్న అనుమానం కలిగి, ఆ వ్యక్తిని చూడడానికి వెళ్ళాను.

అతి సామాన్య గృహస్థు. విరిగిపోయిన కుర్చీలో చేరగిలబడి, మాసిన గోడకు తల ఆనించి కూర్చుని, ఒళ్ళో ఆఖరి పిల్లను పడుకోపెట్టుకుని తలకు అమృతాం. జనం రాస్తూ మాట్లాడుతున్న ఈ వ్యక్తికి ఏదో గొప్పతనం మామూలు పరిస్థితుల్లో ఆపాదించడం జరిగే పనికాదు.

కానీ, కుతూహలం చాలా సమస్యలకు కారణం... అప్పుడప్పుడు కొన్ని పరిష్కారాలకు కూడా.

మెల్లగా "ఆమె" గురించి మాట్లాడాను. అడిగాను.

"ఎలా వుంది ఇప్పుడు?" నవ్వుతూ అడిగాడు. ఆ మాటలకు అతనిలోని చాలా చీకట్లు, మామూలుతనం పోయినట్లయింది.

"సీత ఇచ్చిన పెన్ను..." పెట్టెలో అడుగు నుంచి తెచ్చి చూపించాడు. ఆవిడ "కీర్తి" అన్న పేరు పెట్టుకోకముందు అదే పేరు "సీత."

"ఎలా పాడుతుంది ఆవిడ?" ఈ ప్రశ్నకు ఎంత చప్పటి సమాధానం వస్తుందో ఊహించుకుంటూనే అడిగాను.

నవ్వాడు హాయిగా....

"ఎలా పాడుతుంది? మీకు తెలియదా? ప్రతి పాటా నా కోసమే పాడుతున్నట్లుంటుంది.... ఆ "నేను" ఈ వాతావరణంలో, ఈ మనుష్యుల మధ్య వ్యక్తిని కాను. ఆవిడ చూపు చూడగలిగిన వ్యక్తిని"

ఆశ్చర్యపోయాను నేను. తెల్లారగానే పదిసార్లు హిట్ డైరెక్టర్లమనిపించుకునే వారిచేత తిట్లు తింటూ, స్క్రిప్ట్ తిరగరాసే వ్యక్తిగానే అతను తెలుసు నాకు.

ఈ మనిషిలో మనిషి ఏమిటి?!

"మరి?" ప్రశ్నార్థకంగా అన్నాను.

"అడగండి ఫరవాలేదు." స్టీలు గ్లాసుతో కాఫీ అందిస్తూ అన్నాడు.

బయట వర్షం, ఆ పెంకుటిల్లు, కాలు తుడుచుకునే గోనె పట్టా, ఈ మనిషితో ఈ సంభాషణా నాకు మరీ ఏదో పాతకాలం బెంగాలీ సినిమా చూస్తున్నట్లుంది. నేను చూస్తున్న రంగుల ప్రపంచంలో ఎక్కడా ఇమడలేని ఈ వ్యక్తి ప్రత్యేకత నన్ను ఇబ్బంది పెడుతోంది. కానీ, నాలో భావుకుడు అంత తేలిగ్గా ఇంత గొప్ప పరిస్థితిని మిస్ అవడూగాక అవడు.

అందుకే అన్నాను:

"ఆవిడకు సన్మానం చేసిన ప్రతిచోటా ప్రతి ఉపన్యాసకుడూ చెప్పేది ఒకటే మాట... ఆవిడ సక్సెస్‌కు కారణం ఆవిడ ప్రతి మనిషికీ తన కోసమే పాడుతోందా అనిపించడం అని. అదెలా మరి? మీ లెక్క ప్రకారం ఆవిడకు ఒక పరిధి పడి ఉంచుకుపోవాలే?"

సాధారణంగా జర్నలిస్ట్‌గా నేను ఇంత లోతుగా ఎవరితోనూ మాట్లాడను. కారణం మమ్మల్ని అసలు ఇలా మాట్లాడించే "డెప్త్" వున్న మనుష్యులు దొరకడమే కష్టం మరి.

నవ్వాడతను హాయిగా.

"మేమిద్దరం ఒకర్నొకరు చూసుకుని కొన్ని ఏళ్ళయింది. ఇందాకే చెప్పాను. మా స్నేహం మామూలు పరిచయాలు బాంధవ్యాలకన్న ఎదిగింది. ఆవిడ పాడేది వ్యక్తినైన నా కోసం కాదు. నేను ఇచ్చే సుందరమైన అనుభూతి కోసం... ఇది ఎంతో కొంత అందరిలోనూ వుంటుంది. ఆ సున్నితమైన భావాన్ని ఆమె నిద్ర

లేపగలుగుతోంది. కాబట్టే ప్రతి ఒక్కరికీ ఆమె తన కోసమే పాడుతోంది అనిపిస్తుంది." చంటిపిల్లను అరుబైట నవ్వారు మంచంమీద పడుకోపెడుతూ చెప్తున్నాడతను.

నేను నోరు తెరిచేశాను. ఈ వాతావరణంలో ఈ మామూలు మనిషి, రవ్వల నగలతో, పట్టు చీరలతో కళకళలాడే ఆ మహాగాయకురాలు - ఎక్కడుంది సామ్యం?

"ఆవిడ అప్పుడు ఎలా వుండేవారు?"

సన్నగా నవ్వాడతను.

"సీత పెద్ద అందమైన మనిషి కాదు, మామూలు లెక్కల్లో. కానీ పెద్ద జుట్టు, గొప్ప కళ్ళు... ఎప్పుడైనా గమనించారా? పాడుతున్న భావం ఆ పెదవులదా, ఆ కళ్ళదా అనిపించదూ?" - ఆ మాటల్లో గొప్ప భావన నన్ను ఉక్కిరి బిక్కిరి చేసింది.

"ఈమధ్య మీరెప్పుడైనా చూశారా ఆవిడను?" ఏదో విచిత్రమైన కథకు నేనే ప్రేక్షకుడిని అనే ఫీలింగుతో అడిగాను.

"ఆ! టి.వి.లో... అలాగే వుంది. ఏం మారలేదు." ఏదో ప్రశ్నిస్తున్నాను. కానీ అతణ్ణే పరీక్షగా చూస్తున్నాను నేను. ప్రపంచం దృష్టిలో చాలా మామూలు మనిషి ఇతను. కానీ ఇతనిలో వ్యక్తి వేరు. అది స్వార్థాలకు, భ్రమలకూ, ప్రాపంచికతకూ అందనిది.

❀ ❀ ❀

అందుకే-

అతను అవుట్‌డోర్‌లో ఏదో కొండ మీదనుండి జారిపడిపోయి చచ్చిపోయాడని తెలిసినప్పుడు-

నేను పరిగెత్తుకుంటూ వెళ్ళాను. ఆవిడ భావాలు రికార్డ్ చేద్దామని పత్రిక కోసం కాదు... వ్యక్తిగా నా కోసం.

ఆవిడ చెక్కుచెదరినట్లు లేదు. ఏదో పెద్ద ఫంక్షన్‌లో అపరంజి జిలుగులు చెక్కుతున్నట్లు గజల్స్ ఏవో పాడుతోంది. రాళ్ళ నగలతో, టిష్యూ చీరతో మెరిసిపోతోంది.

"నాకు కావలసినది వ్యక్తి కాదు, అనుభూతి" అంటున్నాయి నా చుట్టూ వెన్నెలదారాల్లా అల్లుకుంటున్న రాగఝరులు.

కానీ, ఎక్కడో ఆ గొంతులో ఏదో ఒక్క విషాదచ్ఛాయ, ఆ గీతంలో ఒక నిరాశాక్షరపు ముగింపు, వెన్నెలంతా ఓ రాగదీపంగా ఆకాశం నుంచి చీకటి లోయల్లోకి జారిపడినట్లుండే ముక్తాయింపు.

గాయం గేయంగా మారుతోందా?

గేయం గాయంగా మారి ఆమె గుండెల్ని కాలుస్తోందా?!

ఇవన్నీ నాకు అర్థమైపోతున్నాయనిపిస్తోంది; నేను కొంత అర్థమైన మనిషిని కాబట్టి.

ఆ తరవాత స్టేజీ వెనకాల మెరిసే పెదవులు, తడిసిన కళ్ళతో ఆమెను చూడగానే-

నాకు అనిపించింది ఆమే మనిషేననీ...

భావన ఎంత ముఖ్యమో, ఉపాధి అంతే ముఖ్యమనీ.

అందుకే,

ఆ తరవాత,

గొప్ప పేరు వచ్చిన తరవాత వారు ఏది చేసినా బావుందనే అరసికశిఖామణులు ఎక్కువగా వున్నా, కొంచెం సున్నితత్వం, మరి కాస్త స్పందన వున్న ఏ ఒకరిద్దరో-

"ఆమె పాట అదోలా వుందేమిటో...." అన్నప్పుడు-

నాకు అర్థమయింది. ఆమెకి ఏమిటి కాదోలా అనుకున్నప్పుడు నాకు గుర్తుకు వచ్చేది అతని నవ్వే

ఆ తరవాత కొద్దికాలానికి....

ఆమె అతడి కుటుంబానికి చేసిన గొప్ప సహాయాలు, తయారుచేసిన గొప్ప గొప్ప సంస్థలు. ఎంతోమందికి ఉపాధికి కావలిసిన ఏర్పాట్లు,

ఇవన్నీ వింటూనే వున్నాను. ఆమెకు మళ్ళీ ఇంటర్నేషనల్ అవార్డే వచ్చిందని తెలిసి వెళ్ళాను.

"ఏమిటిదంతా?" అడిగాను. ప్రపంచం కోసం, ఫోటోల కోసం దానధర్మాలు చేసే "నైచ్యం" ఆమెలో లేదు. అందుకే అడిగాను "ఏమిటిది?" అని.

"రిహాబిలిటేషన్.... ఇదంతా నా కోసమే..." "అంటే?" ఆలోచిస్తూ అడిగాను. ఆమె ట్రస్టులన్నీ ఏహో పొడక్షరాల పేరుతో వున్నాయి. నాకు తెలుసు - అవన్నీ విప్పితే దానికర్థం అతని పేరేనని.

"అతను బ్రతికుండగా ఎక్కడో వున్న అతని భావన నాకు గొప్ప అనుభూతి నిచ్చేది. కానీ ఆ తరవాత 'లేదు' అన్న ఆలోచన నుంచి ఎదిగి గాలిలోనించి ఆ భావం పొందే శక్తి నాకు లేదు.

అందుకే, అతని భావనను నా గుండెల్లోనించి విస్తరింపచేసి నా చుట్టూ ఈ రకంగా పరుచుకుంటూ వస్తున్నాను. ఇది నాలోనించి ప్రవహించి, వెన్నెల్లా విస్తరించి మళ్ళీ నాలోకి వచ్చి నా నరనరాల్నీ తడుపుతోంది ఆ తృప్తి.... అది మీకు అర్థమై వుంటుంది.

అదే... మళ్ళీ అనుభూతిగా మారి నా గొంతులోని మామూలు తీయదనాన్ని, నమ్మకాన్ని కలిగిస్తోంది.

అందుకే నా గొంతు మళ్ళీ మామూలుగా పాడుతోంది." నవ్వుతూ చెప్పింది ఆవిడ. కొంత డబ్బు ఇలా వినియోగించడానికి తన ఇంట్లో ఎంత పోరాడి వుంటుందో నాకు తెలుసు. ఆవిడ కోసం ఆవిడ బ్రతకడం ప్రారంభించింది.

నాకు అర్థమైంది ఆమె పోగొట్టుకున్నదేమిటో. అది మామూలే. చాలా మందికి ఈ "సలుపు" తెలుసు.

కానీ ఆవిడకు అర్థమైంది దాన్ని తిరిగి ఎలా పొందాలో.

తలవంచి నమస్కరించాను-

ఆవిడలో మహా గాయకురాలికే కాదు, ఎదిగిన మనిషికి కూడా!

అందుకే....

ఆ మర్నాడు ఆవిడ గురించి న్యూస్ రాసి కంటెయ్‌నర్‌కు ఇవ్వలేదని తిట్లు తిన్నాను ఎడిటర్‌గారి చేత.

కానీ....

ఎలా రాయను? ఏమి రాస్తే అదేమిటో ఎవరికి అర్థమౌతుంది?... మామూలు తడిలేని మాటలు.... ప్రాణం లేని శబ్దాలు... ఎలా రాయను ఆమె గురించి?!

(ఆంధ్రజ్యోతి, 21-7-1989)